# సత్సంగం



# గురువుగారి సత్సంగంలో పాలుపంచుకోవడం

గురువుగారి సత్సంగంలో పాలుపంచుకోవడం ఓ అద్భుతమైన అనుభవం. ఆయన మాటల్లోని అంతఃదృష్టి, జాలువారే హాస్యం, చమత్కారాలతో వాతావరణమంతా ఉత్సాహంగా, ఉత్తేజ భరితంగా ఉండేది. ఆయన సాన్నిధ్యంలో ప్రతి ఒక్కరూ ఓ క్రొత్త, శక్తివంతమైన అనుభవ క్షేత్రంలోనికి ప్రవేశించేవారు. కళ్ళ ముందు కనిపించే దృశ్యాలు, చెవులకు వినిపించే మాటల వెనుక అంతులేని శాంతి, మౌనం, ఊహకు సైతం అందనంత ప్రేమ, వీటన్నింటికీ నేపథ్యమైన అపారమైన భద్రతా భావం అనుభవమయ్యేవి. గంటలకు గంటలు గమనింపులోనికి రాకుండా అలా దొర్లిపోయేవి. కాలాతీతమైన ఆ సన్నిధి వర్షించే అనుగ్రహధారలలో ప్రతి ఒక్కరూ తడిచి, సేదదీరి నూతన ఉత్తేజంతో తొణికిసలాడేవారు.

సత్సంగాలు ముందుగా అనుకోకుండా అప్పటికప్పుడు అలా జరిగేవి. ముఖ్యంగా 'ఫలానా' సమయంలో సత్సంగం ఉంటుందని ముందుగా తెలియజేయడం అంటూ ఏమీ ఉండేది కాదు. సత్సంగాలు చాలావరకు రాత్రిపూట జరిగేవి. శ్రీబాబూజీ చిన్నతనం నుండి రాత్రి సమయాలలో సాధనలో మునిగివుండేవారు. సత్సంగాలకు నిర్దేశిత ప్రదేశమంటూ ప్రత్యేకించి ఉండదు: శ్రీబాబూజీ ఉన్న ప్రాంతాన్ని బట్టి శిరిడీ, తిరుమల, చెన్నై సముద్రతీరాన, హృషీకేశ్, వారణాసి, ఉత్తరకాశీ, తిరువణ్ణామలైలోని వారి చిన్న ఫ్లాట్... లేదా ప్రయాణ సమయంలో రైలులోనో, బోటులోనో ఎక్కడైనా, ఎప్పుడైనా అప్పటికప్పుడు సత్సంగం జరిగేది. సత్సంగం ప్రారంభంలో

ఆ ప్రాంతమంతా నిశ్శబ్దం నెలకొని ఉండేది. గురువుగారు తమ శ్రావ్య గంభీరమైన మంద్ర స్వరంతో నెమ్మదిగా, "ఏమిటి సంగతులు" అని అడిగేవరకు ఆ నిశ్శబ్దం కొనసాగేది.

సత్సంగాలలో ఎవరైనా ప్రశ్నించే వరకు మాట్లాడకపోవడం గురువుగారి పద్ధతి. ఆయన ఏనాడూ ఏకపక్షంగా ఉపన్యాసాలివ్వలేదు. అడిగిన వ్యక్తి అవసరాన్ని బట్టి వారి సమాధానం ఉండేది. ఎవరైనా ఏదైనా విషయాన్ని గురించి ప్రశ్నించడం, దానిని గురువుగారు వివరించడం... ఇలా సాగేది సత్సంగం. ఒక ప్రశ్నకు వివరణ ఇవ్వడం అయిపోయాక తిరిగి ఎవరైనా అడిగేవరకు వారు మౌనంగా ఉండేవారు. సత్సంగంలో గురువుగారు అత్యంత ఉత్సాహభరితంగానూ, సావధానంగానూ ఉండేవారు. ఆయన సమాధానాలు ఎప్పటికప్పుడు సరిక్రొత్తగా ఉండి మన నమ్మకాలను సవాలు చేస్తూ, మనం ఏర్పరుచుకున్న అభిప్రాయాలను ప్రశ్నిస్తూ ఉండేవి. గురువుగారు ఇచ్చే సమాధానాలు అడిగిన వ్యక్తి అవసరాలను ఉద్దేశించి, వాటికి సంబంధించినవిగా ఉండి, ఆ ప్రశ్నలోని విభిన్న అంశాలను, కోణాలను తెలియజెప్పేలా ఉండేవి. చాలామందికి తమ మనస్సులోని సందేహాలు గురువుగారిని వాచా అడగకుండానే సమాధానపడినట్లుగా అనుభవమయ్యేది. గురువుగారు తమ మనస్సులోని సందేహాలను తీర్చారనిపించేది.

కొన్ని సంవత్సరాలపాటు చాలా ప్రదేశాలలో జరిగిన సత్సంగ సంభాషణల నుండి తీసుకున్న కొన్ని శీర్షికలను ఈ చిన్నపుస్తకంలో పొందుపరచడం జరిగింది. ప్రేమ, ఆనందాలతో మన హృదయాలు మరింతగా వికసించడానికి ఇవి ఆధారభూతమై, మనకు ప్రేరణ కలిగిస్తాయని ఆశిస్తున్నాము.

# సత్సంగం అంటే?

భక్తుడు:

గురువుగారూ, సత్సంగం అంటే ఏమిటి?

గురువుగారు:

సత్సంగానికి మూడు అర్థాలు ఉన్నాయి:

సత్ అంటే 'సత్యం' లేదా 'ఉన్నది', సంగం అంటే 'సాంగత్యం', 'కలసి ఉండటం'. కాబట్టి సత్సంగం అంటే మనం సత్యం యొక్క సాంగత్యంలో ఉండటం, సత్యంతో లయమై ఉండటం. అదీ నిజమైన సత్సంగం.

సత్యాన్ని దర్శించిన సత్పురుషుల సాంగత్యంలో ఉండటం రెండవది. మనకు అవకాశం వచ్చినప్పుడల్లా, వారిని దర్శించి వారి మార్గదర్శకత్వాన్ని, ఆశీర్వాదాన్ని తీసుకోవడానికి ప్రయత్నించడం.

మూడవ అర్థంలో, మనం ఎవరితోనైతే సత్యం గురించి తదేకమైన ఆసక్తితో, తపనతో చర్చించుకోగలమో, ఉపయుక్తమైన వాతావరణంలో మన అనుభవాలను పంచుకోగలమో, అటువంటి వారి సాహచర్యంలో ఉండటం. అక్కడ మనం సత్యాన్ని దర్శించిన సత్పురుషుల జీవితాల గురించి మాట్లాడుకోవచ్చు, వ్యక్తులుగా మన అస్తిత్వపు యదార్థత గురించి, జగత్తు యొక్క వాస్తవికత గురించి, మనకూ, జగత్తుకూ ఉండే సంబంధం గురించి అన్వేషణ చేసే ప్రయత్నం చేయవచ్చు. అందరూ కలసి నామం చేసుకోవడం, భజన చేసుకోవడం, సద్గ్రంథాలు

చదువుకోవడం, అనుభవాలు పంచుకోవడం చేయవచ్చు. ఒకే ఆలోచనాదృక్పథం కలిగిన వారితో అనుబంధం, ఆత్మీయత, స్నేహం పెంచుకోండి. అన్ని సామాజిక సంబంధాలను ఆధ్యాత్మిక సంబంధాలుగా మార్చుకోవడానికి ప్రయత్నించండి. మీ మార్గాన్ని వారితో పంచుకోండి! వారితో మాట్లాడేటప్పుడు అస్పష్టమైన తాత్విక పదజాలాన్ని వాడకుండా, మనకు అలవాటైన వాడుక భాషలో, వాళ్ళకు అర్థమయ్యే రీతిలో మాట్లాడండి.

ఇలా మనం ఈ మూడు మార్గాల్లో సత్సంగం చేయవచ్చు.

## స్వంత ఆధ్యాత్మిక మార్గాన్ని తెలుసుకోవడం

భక్తుడు:

గురువుగారూ, ప్రతి ఒక్కరూ ఎవరి ఆధ్యాత్మిక మార్గాన్ని వారికి తగినట్లు వ్యక్తిగతం చేసుకోవడం చాలా ముఖ్యమని మీరు గట్టిగా చెప్తూ ఉంటారు. ఈ విషయం గురించి సత్సంగంలో చాలా రకాలుగా చెప్పారు. ఎవరో లక్ష్యాన్ని మేము ఎంచుకోకుండా, మాకు నిజంగా అవసరమైన దానిని మేము తెలుసుకోవడం, మాలో ప్రతి ఒక్కరికీ ఓ స్వంత మార్గం ఉండటం, ఏదో పుస్తకాలలో చదివిన సిద్ధాంతాలు కాకుండా మాకంటూ స్వీయ సిద్ధాంతాలు, ఆలోచనలు కలిగి ఉండటం, మా మార్గంలో మేము అక్కడా ఇక్కడా తీసుకున్న సిద్ధాంతాలను, భావనలనూ ప్రక్కన పెట్టి “మా శాస్త్రాలను మేమే వ్రాసుకోవాల”ని మీరంటారు.

గురువుగారు:

గమ్యం యొక్క విలువను తెలుసుకోవడమంటే దానిని వ్యక్తిగతంగా మీకు తగిన రీతిలో మలచుకోవడం. ఎవరో వంద మంది ఓ మార్గంలో వెళుతున్నారు కాబట్టి మనమూ వారిని అనుసరించడం కాదు. వారు ఎక్కడికి వెళుతున్నారో మీకు తెలియకపోవచ్చు లేదా వారు ఎక్కడికి వెళుతున్నారో అది మీ అవసరం కాకపోవచ్చు.

మతాన్ని చాలామంది అలాగే పాటిస్తారు. ఇరుగు పొరుగు వారు చర్చికి వెళుతుంటే, వీళ్ళు కూడా వెళతారు. వాళ్ళు భోజనం చేసే ముందు ప్రభువు ప్రార్థన చేస్తారు కాబట్టి వీళ్ళు కూడా ప్రార్థన చేస్తారు. కానీ అది వ్యక్తిగతంగా వారి హృదయాలను తాకడం లేదు. అందరూ చేస్తున్నారు కాబట్టి వీళ్ళు కూడా చేస్తారు.

మతం అనేది నమ్మకాల సమాహారం. కానీ బాబా అంటే ఏవో నమ్మకాలు, నిబంధనలు లేదా సిద్ధాంతాల కూర్పు కాదు. బాబా అంటే ఒక వ్యక్తిగతమైన అనుభవం.

మీరు నన్ను ఓ ప్రశ్న అడిగినప్పుడు, నేను కూడా శాస్త్రాలను ఉటంకిస్తున్నాను, కానీ అవి నేను చెప్పాలనుకున్న విషయాన్ని మరింత విపులం చేస్తేనే వాటిని ప్రస్తావిస్తాను. అంతేగానీ ఆ విషయం శాస్త్రాల్లో ఉన్నందువల్ల నేను చెప్పను. ఒకవేళ శాస్త్రాలు వేరే విధంగా చెబితే, నేను వాటిని పట్టించుకోను. నా దృష్టిలో రోజువారీ జీవిత సంఘటనల నుండి ఒక ఉదాహరణ ఇవ్వడం, మహాభారతం మరియు గీత నుండి ఇచ్చే ఉదాహరణతో సమానం. ఆ ఉదాహరణ యొక్క ప్రయోజనం నెరవేరడం ముఖ్యం.

గురువుగారు:

నేను చాలా విషయాలు చెప్పవచ్చు, ఎవరికివారు తమకు అనువైన వాటిని ఎంచుకొని సాధన చేస్తారు. మిగతా విషయాలు మీకు మేధోపరమైన అవగాహన మాత్రమే ఇవ్వగలవు, అంతే.

ఈ సత్సంగాలు మీకు జ్ఞానోదయం కలిగిస్తాయని, నా ఉపన్యాసాలతో మీకు జ్ఞానం వస్తుందనీ నేను నమ్మను. కొంతసేపు మీతో ఇలా కూర్చోవడానికి ఇదొక అవకాశం, అంతే. ఇప్పుడు మనం మాట్లాడుకునే విషయాలు చాలా ముఖ్యమైనవని నేననుకోను. ఎందుకంటే నేను ఉపన్యాసాలను, వాచా బోధించడాన్ని విశ్వసించను.

నిజంగా అది అంత ఉత్తమమైనదే అయివుంటే, బాబా బోధించి ఉండేవారు. ప్రపంచమంతా తిరుగుతూ ఉపన్యాసాలు ఇచ్చివుండేవారు! (గురువుగారు నవ్వుతూ...) బాబా చేయని దానిని నేనెందుకు చేయాలి? అందుకే నేను కూడా ఉపన్యాసాలు ఇవ్వను, బహిరంగంగా సత్సంగం చేయను. ఇది కొంతసేపు మీతో కలిసి కూర్చోవడం కోసం మాత్రమే. కూర్చున్నాక ఏదో ఒకటి మాట్లాడుకోవాలి కాబట్టి ఈ (ఆధ్యాత్మిక) విషయాల గురించి మనం మాట్లాడుకుంటున్నాం (గురువుగారు నవ్వుతూ...)

ఎందుకంటే బాబా చేసేది ఏదైనా దాన్ని వాచా బోధించడం ద్వారా చేయరు. ఆయన మార్గం భిన్నంగా ఉంటుంది – బాబా (మనకు కావలసింది) ఇస్తారు! “మీరు ఇలా చేస్తేనే నేను మీకు ఇస్తాను. అలా చేయవద్దు, మీరు అలా చేస్తే నేను మీకు ఇవ్వను” అని బాబా ఎన్నడూ చెప్పలేదు.

అలాంటిదేమీ లేదు. బాబాకు ఎలా ఇవ్వాలో తెలుసు, అది నా అనుభవం. మనమందరం కలిసి కూర్చోవడానికి సత్సంగం ఒక మిష మాత్రమే.

భక్తుడు:

గురువుగారూ, మరి ఆధ్యాత్మిక పరివర్తన ప్రక్రియలో వాచా చేసే బోధనల యొక్క పాత్ర ఏమిటి?

గురువుగారు:

అది వ్యక్తి యొక్క అవసరాన్ని బట్టి ఉంటుంది. ఒకరికి వాచా బోధించడం అవసరమైతే, అలా బోధించడం జరుగుతుంది. వేరొకరికి ఆ అవసరం లేకపోతే, ఇక బోధించనవసరం లేదు.

కేవలం వాచా బోధిస్తేనే అర్థం చేసుకోగలిగిన వారికి, దానితోనే ప్రారంభించాలి. కానీ అది ఆరంభం మాత్రమే, ఆ తరువాత అది వారిని మాటలకు అతీతమైన దానివైపు తీసుకెళుతుంది. ఎందుకంటే అనుభవ స్థాయిలో (క్రియా) పదాలు ఉండవు! (గురువుగారు నవ్వుతూ...) అందుకే శాస్త్రాలు, "మనస్సు దానిని చేరుకోలేదు, వాక్కు దానిని చేరుకోలేదు" అని చెప్పినప్పటికీ, ఆ పదాలు వర్ణించలేని దాని గురించి లెక్కకు మించిన పుస్తకాలు ఉన్నాయి. ఆ రచయితలు వర్ణనాతీతమైన దానిని వర్ణించడానికి, అనిర్వచనీయమైన దానిని నిర్వచించడానికి ప్రయత్నిస్తూ ఉన్నారు. ఎందుకు? ఎందుకంటే అది కూడా అవసరం. వాగ్రూపమైన అన్ని బోధనల వలనా ప్రయోజనం లేదని కాదు. రెండూ అవసరం.

భక్తుడు:

అంటే సత్సంగం సాధ్యమైనంత ఎక్కువగా మౌనంలో జరగడం సరైనదంటారా, గురువుగారూ?

గురువుగారు:

ముందు మన అవసరమేమిటి, దానిని పొందేది ఎలా అనే విషయాల పట్ల దృష్టి పెడదాం. మన సమస్యేమిటి, దానిని తీర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నామా? సత్సంగం, ధ్యానం మనకు ఉపయోగపడుతుందా? దానిపై దృష్టి పెడదాం.

నా దృష్టిలో ఎవరికి వారు వ్యక్తిగతంగా వచ్చి ఇక్కడ కూర్చున్నారు – మీరు ఒక గ్రూప్‌గా కూర్చోవడం లేదు, మీలో ప్రతి ఒక్కరూ నాతో కూర్చొని ఉన్నారు, నేను మీలో ప్రతి ఒక్కరితో కూర్చొని ఉన్నాను!

## సత్సంగం యొక్క ఉద్దేశ్యం

గురువుగారు:

ఇక్కడ జరుగుతున్న ఈ సత్సంగంలోనైనా సరే, నేను మీ ప్రశ్నలకు సమాధానమిస్తున్నాననేది ఒక భ్రమ. ఒకరి ప్రశ్నలకు మరొకరు సమాధానం చెప్పగలరని ఎవరైనా చెబితే అది అబద్ధం. నేను దానిని నమ్మను! నేను భ్రమల్లో ఉండను. (గురువుగారు నవ్వుతూ...) మీ ప్రశ్నలు, ఈ సమాధానాల ద్వారా ఇంకేదో జరుగుతుంది. దానికి, దీనికీ ఏమాత్రం సంబంధం లేదు. సత్సంగం యొక్క అసలు ఉద్దేశ్యమది. మీరు ముఖతా అడిగే ప్రశ్నలు, వాటికి నేనిచ్చే సమాధానాలూ కాదు. మీ మేధస్సుగానీ లేక నేనిచ్చే మేధోపరమైన సమాధానాలుగానీ సత్సంగం యొక్క లక్ష్యం కాదు. లేదు, ఇంకేదో జరగాలి. అది జరుగుతుందా, లేదా అనేది మీ అనుభవమై ఉండాలి.

భక్తుడు:

అప్పుడు జరిగే ఆ ‘ఇంకేదో’ ఏమిటి గురువుగారూ?

గురువుగారు:

మనం దానిని వివరించలేము. “అవును, చాలా బాగుంది! ఏదో తొలగిపోయింది” అని మీకు అనిపిస్తుంది. ఎవరైనా వచ్చి, ఏమి తొలగిపోయింది? “చెప్పు, తొలగిపోయినదేమిటి?” అని ఎవరైనా మిమ్మల్ని అడిగితే, “నాకు తెలియదు, కానీ నాకు కొంత స్పష్టత వచ్చింది, కొంత భారం నా నుండి తొలగింపబడింది” అంటారు. ఆ భారం ఏమిటి? అది మీకు తెలియదు. ఏదో జరుగుతుంది.

భక్తుడు:

కనుక ఇది జరగాలంటే మీతో ప్రత్యక్షంగా సత్సంగంలో ఉండాలి. సత్సంగాల రికార్డింగ్‌లు వినడం వల్ల అలా జరగదా?

గురువుగారు:

కొన్నిసార్లు దానివల్ల కూడా జరుగుతుంది. నేను చెప్పేది ఏమిటంటే, ఇది కేవలం పదాల వలన జరిగేది కాదు. పదాలకు మరికొన్ని పర్యవసానాలు ఉంటాయి.

భక్తుడు:

స్పష్టత సాధించడంలో అనుగ్రహం యొక్క పాత్ర ఏమిటి?

గురువుగారు:

ఉదాహరణకు, మీకు స్పష్టత అవసరం అనుకుందాం, మీరు ఇక్కడకు వచ్చి సత్సంగంలో కూర్చుంటారు, మీరు దేనికోసమైతే ప్రయత్నిస్తున్నారో దానిని నా మాటలు మీకు విస్పష్టంగా తెలియజేసాయి – ఆ చర్యను 'అనుగ్రహం' అంటారు. ఇక్కడ ఏం జరిగిందో అది అనుగ్రహం.

ఒకవేళ మీకు అప్పటికే కొన్ని నిర్ణీతమైన భావనలు ఉండి, ఆ స్పష్టత అవసరం లేకపోతే నేను చెప్పే ప్రతి విషయానికి అడ్డుపడుతూ, ఒక రకమైన రన్నింగ్ కామెంటరీలాగా వ్యతిరేకమైన వాదనను సృష్టించడానికి ప్రయత్నిస్తారు. అప్పుడు మీరు మరింత గందరగోళంలో పడతారు. అప్పుడు సత్సంగం అనుగ్రహపూరితమైన చర్య కాదు.

కాబట్టి మీరు ఏది అనుభూతి చెందుతున్నారు, ఎలా అనుభూతి చెందుతున్నారు అనేది అనుగ్రహం. ఆ అనుభవం మీకు అవసరమా కాదా అనేదానిపైన అది ఆధారపడి ఉంటుంది. మీ అనుభవం అందంగా, ఆనందంగా ఉండాలి. (గురువుగారు నవ్వుతూ...) ఒకవేళ ఆ అనుభవం మీకు వెలుపల ఏదైనా కారణంవల్లగానీ, వ్యక్తివల్లగానీ కలుగుతోందని అనిపిస్తే, అప్పుడు మనం – ఇది బాబా అనుగ్రహమా లేదా మరొకరి అనుగ్రహమా, అది "ఎవరి అనుగ్రహం వల్ల" అనే పదాలు వాడుతాం.

కానీ అది వారి (సద్గురువు) చర్యలపై ఆధారపడి ఉండదు. మీరు దానిని ఎలా స్వీకరిస్తున్నారు, ఎలా అనుభూతి చెందుతున్నారు అనే అంశం మీద ఆధారపడి ఉంటుంది.

## సద్గురు చరణ సన్నిధిలో

భక్తుడు:

గురువుగారూ, సద్గురు పాదాల వద్ద కూర్చోవడంలో సకల శాస్త్రాలు, అన్ని ఉపదేశాలు ఇమిడి ఉన్నాయి అని చెప్పడం సరైనదేనా? సద్గురు పాదాల చెంత ఎవరైన సరిగ్గా కూర్చోగలిగితే, ఉపదేశాలన్నింటితో సహా సర్వం అందులో ఉన్నట్లేనా?

గురువుగారు:

అలా కూర్చుంటేనే నిజానికి కూర్చున్నట్లు లెక్క. వాస్తవంగా కూర్చోవడమంటే అది. గురువు పాదాల వద్ద కూర్చోవడమే ఓ ఉపనిషత్తు. ఉపనిషత్ అన్న పదానికి అర్థం ఏమిటి? అక్కడ ఏమి పొందుతున్నారు అనేది కాదు. అక్కడ కూర్చున్నారనేదే ఉపనిషత్తు [ఉపనిషత్తు అనే పదానికి సంస్కృత అర్థం 'సమీపంలో కూర్చోవడం (గురువు పాదాల వద్ద)', ఉప 'దగ్గర' + ని-షద్ 'కూర్చోవడం']. అప్పుడు, శిష్యుడి ఆకాంక్షలు, అవసరాలను బట్టి, గురువు విభిన్న రీతులలో ప్రబోధిస్తారు. అందుకే మనకు ఇన్ని భిన్న సిద్ధాంతాలు, విభిన్న తాత్విక పంథాలు కనిపిస్తున్నాయి.

భక్తుడు:

గురువుగారూ, సత్సంగంలో మాకు సమాధానం లభించినట్లు అనిపించవచ్చుని, కానీ జరగాల్సిన అసలు విషయం సత్సంగానికి వెలుపల జరుగుతుందని మీరు అన్నారు.

గురువుగారు:

మీ హృదయంలో వచ్చే నిజమైన పరివర్తన నేను సత్సంగంలో మాట్లాడే మాటలవల్ల కాదు. మిమ్మల్ని ప్రభావితం చేసేది, మార్చేది, నేను మాట్లాడే మాటలు కాదు. మాటలు మీ మేధస్సును పెంచవచ్చు, లేదా మేధోపరమైన గందరగోళాన్ని తొలగించవచ్చు. అంతమాత్రాన దాని వల్ల ఉపయోగం లేదని నేననడం లేదు - కానీ నిజమైన పరివర్తన ఈ మాటల వల్ల కాదు. పుస్తకాలు, ఉపన్యాసాలు ఎవ్వరినీ మార్చవు. కొంతమందికి అవి ఓ మీటలాగా ఉపయోగపడవచ్చు.

భక్తుడు:

ప్రశ్న అడగడమనేది అడిగే వ్యక్తి యొక్క పరివర్తనకు ఏమైనా ఉపయోగపడుతుందా?

గురువుగారు:

ఏమీ లేదు. ఒకవేళ మేధోస్థాయిలో ఏదైనా మిమ్మల్ని ఇబ్బంది పెడుతుంటే దానికి మేధోపరమైన సమాధానం ఇస్తే, ఆ మేరకు స్పష్టత వస్తుంది. చాలామందికి మేధోస్థాయిలో సమాధానం చెప్పినపుడు అది వారిని సమాధానపరచినట్లు, వారు చాలా స్పష్టతను సాధించినట్లు అనిపిస్తుంది.

కానీ అది నిజం కాదు. ఇది తాత్కాలికమే. తరువాత మళ్ళీ ప్రశ్న తలెత్తుతుంది. అందుకే ఒకటి, రెండు గంటల సత్సంగం తరువాత, వాస్తవానికి మీలో ఎవరికీ అడగడానికి ప్రశ్నలు ఉండవు. కానీ, అది ఎప్పటికీ అలానే ఉంటుందా? ఉండదు! కొద్ది రోజుల తరువాత, మరికొన్ని ప్రశ్నలు తలెత్తుతాయి. కనుక ఇది కొనసాగుతూ ఉంటుంది.

ఒకటి లేదా రెండు గంటలు ఇక్కడ కూర్చొన్న తర్వాత మీరు సత్సంగం నుండి బయటకెళ్ళినపుడు మీ మనస్సు పొందే స్థితి సత్సంగం యొక్క అసలు ప్రయోజనం. మీరు ప్రయత్నించినప్పటికీ, ప్రశ్న అడగడానికి మీకు మేధోపరంగా లేదా భావోద్వేగపరంగా మిమ్మల్ని ప్రేరేపించేది ఏదీ లేదు. మీ మనస్సులో ఒక ఆలోచనను తీసుకురావడానికి మీరు ఎంత పెద్ద ప్రయత్నం చేసినా, అది రావడానికి నిరాకరిస్తుంది. సాధారణంగా మన సమస్య ఏమిటంటే ఆలోచనలను ఆపడం. కానీ సత్సంగం తరువాత ఒక ప్రశ్నను ఒక క్రమంలోనికి తీసుకువచ్చే ప్రయత్నం చేయడం కూడా అసాధ్యం అవుతుంది. ఆలోచించడానికి ప్రయత్నించినా ఆలోచనలు రాని స్థితి అది. ఆ స్థితికి, నేను అంతకు ముందు మాట్లాడిన దానితో సంబంధం లేదు. అదీ సత్సంగ ఫలం, సత్సంగానికి ఫలితం, నిజమైన ప్రయోజనం.

భక్తుడు:

కాబట్టి ఇక్కడ ఏమి జరుగుతుందో అది మాటలకు, మనస్సుకు అతీతమైనది. వ్యక్తి ప్రశ్న అడిగాడా లేదా, మేము ఎంత ఎక్కువ అడుగుతున్నాము, ఎంత తక్కువ అడుగుతున్నాము అనే దానిమీద ఆ అనుభవం ఆధారపడి ఉండదు. మరేదో ఉంది, మాకు అర్థంకాని, బహుశా ఎప్పటికీ అర్థం చేసుకోలేని మార్మికత ఏదో ఉంది, అది కేవలం మీ సన్నిధిలో ఉండటం ద్వారా అది మాపై చాలా ప్రభావవంతంగా పనిచేస్తూ ఉంది.

గురువుగారు:

మనవైపు నుండి, మనం ఏమాలోచిస్తున్నాము, మనం ఎలా అర్థం చేసుకుని ఆనందిస్తున్నాము, మనం ఎలా తీసుకుని ఎలా నిలుపుకుంటున్నాము అనేది మనం చూసుకోవాలి. నేను సత్సంగంలో మాట్లాడినప్పుడల్లా ఆ అంశం గురించే మాట్లాడతాను, ఎందుకంటే మనకు లోపల జరిగే వాటి గురించిన ఎరుక ఉండదు. దాని వెనుక ఉన్న మెకానిజమ్ మనకు తెలియదు.

## వినడానికి అడ్డంకులు

భక్తుడు:

గురువుగారూ, కొన్నిసార్లు మాలో ఒకరు మిమ్మల్ని ఒక ప్రశ్న అడుగుతారు. మీరిచ్చే సమాధానం ఎంతో విస్పష్టంగాను, సూటిగానూ ఉందని చాలామందికి అనిపిస్తుంది. కొన్నిసార్లయితే ఆ వ్యక్తికి మళ్ళీ మళ్ళీ స్పష్టంగా తెలియజెప్పేటట్లు ఉంటుంది. అయినప్పటికీ ఆ ప్రశ్న అడిగిన వ్యక్తి మీ సమాధానాన్ని సరిగ్గా వినలేకపోతున్నట్లు అనిపిస్తుంది. ఇది చాలా విచిత్రంగా ఉంటుంది. దానికి కారణం వినడానికి మాలో ఏదైనా అడ్డంకులు ఉండటమా? దానికి కారణం ఏమిటి, ఎందుకని మేము కొన్నిసార్లు మీరు చెప్పేది వినలేకపోతున్నాము?

గురువుగారు:

ఇది చాలా కారణాల వల్ల జరుగుతుంది. ఒకటి, వారు ప్రశ్నను అడుగుతున్నపుడు, వారు భావోద్వేగానికి లేదా అహంకారానికి సంబంధించిన గందరగోళాన్ని మేధోపరమైన ప్రశ్నలాగా అడుగుతారు. నేను ఇచ్చే సమాధానం ఆ ప్రశ్నకు సంబంధించిన మేధోపరమైన అంశాలకు

మాత్రమే వర్తిస్తుంది. భావోద్వేగపరమైన ఇబ్బందులు లేనివారికి ఆ సమాధానం చాలా స్పష్టంగా ఉన్నట్లు అనిపిస్తుంది. కానీ అడిగిన వ్యక్తికి, ఇది అసలు సమాధానం కాదు. నిజమైన సమాధానం కోసం మరేదో ఒకటి చేయవలసి ఉంది. అది సత్సంగం సమయంలో జరగదు, తరువాత జరుగుతుంది.

మరికొంతమంది నిశ్చితమైన అభిప్రాయాలతో వస్తారు. వారు అప్పటికప్పుడు సమాధానాన్ని అంగీకరించడం చాలా కష్టం. వారి అహం దానిని ఓటమిగా భావిస్తుంది, కాబట్టి వారు దానిని అంగీకరించడానికి సిద్ధంగా ఉండకపోవచ్చు. కానీ ఇతరులకు సమాధానం స్పష్టంగా ఉంటుంది.

ఇలా, చాలా కారణాలు ఉన్నాయి. ఉదాహరణకు, ఎవరికైనా కొంత దృష్టి సమస్య ఉండి, వారు దీనిని ఇది యాష్‌ట్రే కాదు గ్లాసు అన్నారనుకోండి. నేను, కాదు ఇది యాష్‌ట్రే అంటాను. నేను దీనిని మీ అందరికీ చూపిస్తాను, దృష్టి సమస్య లేని వారందరికీ ఇది చాలా స్పష్టంగా ఉంది. "అవును, ఇది ఒక యాష్‌ట్రే, మాకు కనిపిస్తోంది" అంటారు. కానీ దృష్టి సమస్య ఉన్న వ్యక్తికి అది యాష్‌ట్రే కాదు. అందుకే ఆమె దానిని గ్లాసు అనుకుని పొరపాటుపడుతోంది. "నేను అలా చూడలేకపోతున్నాను! ఇది ఇప్పటికీ ఒక గ్లాసే!" అంటుంది. కాబట్టి మనం చేయవలసింది కంటి అద్దాలు మార్చడం లేదా ఆ దృష్టి లోపానికి కొంత చికిత్స చేయడం. అప్పుడు దృష్టి స్పష్టంగా ఉంటుంది. అప్పుడు ఆ వ్యక్తి కూడా వాస్తవంగా అది ఏమిటో చూడటం ప్రారంభిస్తాడు.

భక్తుడు:

గురువుగారూ, "మమ్మల్ని మేము భ్రమలో ఉంచుకుంటున్నామా? మాకు నిజంగా ఈ అవసరం ఉందా? మేము నిజంగా మనస్సు లగ్నం చేస్తున్నామా?" – ఇలాంటి ప్రశ్నలను మాకు మేము వేసుకోవడాన్ని మీరు ప్రోత్సహిస్తారు. ఇలాంటి వాటిని నేను విన్నాను, కానీ నాకు వాటికి సమాధానాలు తెలియదు. బాబా మాకు సమాధానాలు ఇస్తారా?

గురువుగారు:

ప్రశ్న యొక్క స్వభావం ఏమిటి? రమణమహర్షి, "నేనెవరు?" అని విచారించమన్నారు. ఈ ప్రశ్నకు రమణులు సమాధానం ఇవ్వగలరా? ఆయన మిమ్మల్ని "నేనెవరు?" అని విచారణ చెయ్యమన్నారు. మీకు సమాధానం తెలుసా? లేదు. అది ఆబ్జెక్టివ్ టైపు సమాధానాలు సరిపోయే ప్రశ్న కాదు. ఉదాహరణకు a, b, c, మరియు తరువాత ఏమి వస్తుంది? చెప్పండి, 'd' కదా. (గురువుగారు నవ్వుతూ...) మీరు నిజంగా భ్రమలో ఉన్నారా, లేదా అనేది మీరే చూసుకోవాలి.

మీరు ఉన్నట్టుండి ఒక దానిని చూస్తారు, అది పాములా కనిపిస్తుంది. మీరు భ్రమపడ్డారు. ఆ సమయంలో మీరేం చేస్తారు? అక్కడ నుండి పారిపోతారు, లేదా లైటు వేస్తారు, లేదంటే అదేంటో చూడటానికి దగ్గరగా వెళతారు. అప్పుడు మీ భ్రమ తొలగిపోతుంది. ఆ ప్రయత్నం మీరు చేయాలి. లేకపోతే మీరు అక్కడ నుండి పారిపోతారు. అలా పారిపోయే బదులు, వెళ్ళి అది నిజంగా పామా, తాడా లేక మరేదైనానా అని స్పష్టంగా చూడమని చెబుతున్నాను. అది పాము కాదు, తాడు అని నేను మీకు చెప్పినా, మీరు "లేదు, మీకు తెలియదు. అది పాము,

నాకు తెలుసు. ఓ బాబా, సద్గురూ మీకు ఇది ఒక తాడు కావచ్చు, కానీ నాకు మాత్రం అది పామే!" అంటారు. (గురువుగారు నవ్వుతూ...) అప్పుడు మీరు తాడుకు పాముకు మధ్య గల వ్యత్యాసాన్ని తెలియజేయడానికి ప్రయత్నిస్తారు. మీరు వెళ్ళి చూడటమే ఏకైక మార్గం. ఒకవేళ మీరు భ్రమపడుతున్నట్లయితే ఆ భ్రమను మీరే తొలగించుకోవాలి.

మీరు భ్రమలో ఉన్నప్పుడు ఎవరైనా సమాధానం చెప్పినా, మీరు దాన్ని ఆ భ్రమలోనే తీసుకుంటారు. మీరు వెళ్ళి చూసేలా చేయడం ద్వారా సద్గురువు మీకు సమాధానం ఇస్తారు. నేను చేస్తున్నది అదే. అది మీరు సమాధానాలను అంగీకరించేలా చేయడం ద్వారా కాదు, మీరు సమాధానపడే స్థితిని ఇవ్వడం ద్వారా జరుగుతుంది.

సమాధానం అనేది సంస్కృతంలో ఒక అందమైన పదం, ఒక వ్యక్తికి జ్ఞానంలో లభించేది సమాధానం: సమాధానం పొందిన స్థితి. ఆ స్థితిలో ప్రశ్నలేమిటి, సమాధానాలేమిటి అంటే అతను చెప్పలేడు. ప్రతిదీ పరిష్కారమైపోయినట్లు ఉంటుంది, మరిక ప్రశ్నలే లేని స్థితిని అతను పొందుతాడు. అతని అన్వేషణ ముగిసింది.

బుద్ధుడు తన అన్వేషణను ప్రశ్నలతో ప్రారంభించాడు: జీవితం అంటే ఏమిటి? మరణం అంటే ఏమిటి? వ్యాధి అంటే ఏమిటి? దీన్ని అధిగమించడానికి మార్గం ఉందా? ఇవీ ఆ ప్రశ్నలు. ఆయన సమాధానం వెతుక్కుంటూ వెళ్ళాడు. ఆయన బోధి చెట్టు క్రింద కూర్చున్నప్పుడు, ఆయన ప్రశ్నలు సమాధానపడ్డాయి. ఆ సమాధానాలేమిటి? ఆయన తన మరణాన్ని జయించాడా? ఆయన దృష్టిలో మరణం అంటే శారీరక మరణమే, దానితోనే ఆయన ప్రారంభించాడు. దానికి ఆయన పరిష్కారం కనుగొనలేకపోయాడు. కానీ తనకు సమాధానాలు దొరికాయని చెప్పాడు. ఆయన సమాధానాలు ఇవ్వలేదు, అదే ప్రశ్నలు వేసుకుని అన్వేషించమని అందరినీ అడిగాడు.

అందులోని అందం అది. వేదాంత పరిభాషలో వారు దీనిని సమాధానం అని పిలుస్తారు, బౌద్ధ పరిభాషలో ఆయన బోధి అని చెప్పాడు. కానీ రెండూ ఒకటే.

కాబట్టి ఇవన్నీ అలంకారికమైన ప్రశ్నలే, వీటికి ఖచ్చితమైన సమాధానాల్లేవు. ఏదో జరుగుతుంది, అంతే. అప్పుడు మీకు సమాధానపడినట్లు అనిపిస్తుంది. వాస్తవానికి జరగాల్సింది అదే.

## ఓ విభిన్న దృక్కోణం

[సత్సంగాలు బాగా ప్రొద్దుపోయాక జరిగేవి, ఆ సమయంలో ఒక్కోసారి గురువుగారు, అచ్చా! మీకందరికీ నిద్రొస్తున్నట్లు ఉంది అనేవారు.]

భక్తుడు:

లేదు గురువుగారూ, గందరగోళంగా ఉంది, పూర్తి గందరగోళం!

గురువుగారు:

అది నిజమైన గందరగోళమే అయితే, మీకు సమన్వయపడని అంశాలేవో వాటిని తెలుసుకోవడానికి తప్పకుండా యత్నించాలి – ఆ పని ఇప్పుడు కాదు, మీ ఖాళీ సమయంలో చేయండి. ఇది మంచి చిహ్నం. మీకు గందరగోళం అనుభవమవుతుంటే, మీరు ఆలోచిస్తున్నారని అర్థం. కాబట్టి ఆ విధంగా చూస్తే నేను విజయం సాధించాను. కనీసం ఒక్కరన్నా గందరగోళానికి లోనయ్యారు. అంటే మీరు నన్ను నిజంగా అనుసరిస్తున్నారని అర్థం! (గురువుగారు నవ్వుతూ...)

మనమందరం ఏదో కొన్ని విషయాలలో, కొన్ని విధానాలలో, అందరూ అంగీకరించే బ్రెయిన్ వాష్‌లో భాగమైపోయి ఉన్నాము. అందుకే వేరే కోణం నుండి ఏదైనా వస్తే మనం గందరగోళంలో పడతాం. మన ఫ్యూజ్ పోతుంది, అంటే మనం అప్పటివరకు ఉన్న వాటి నుండి విడివడతాం. అప్పుడు ప్రయత్నిస్తే మళ్ళీ క్రొత్త సర్క్యూట్‌కు ఫ్యూజ్ అవుతాం (అందులో భాగమవుతాం). కొంతకాలం తరువాత ఇది కూడా మళ్ళీ ఒక అలవాటు (ప్యాట్రన్)గా మారుతుంది. నేను ఇక్కడే ఆగిపోతానని అనుకోకండి! (గురువుగారు నవ్వుతూ...) ఇది ప్రస్తుతానికి మాత్రమే.

## మిష్టరీ

నేను మీకు సమాధానాలివ్వడానికి ప్రయత్నించడం లేదు, మీకు తెలియని ఏదో మిష్టరీ ఉందనే భావన కల్గించడానికి మాత్రమే ప్రయత్నిస్తున్నాను. ఎందుకంటే మీకు సమాధానాలివ్వడానికి ప్రయత్నిస్తే మీ ఉత్సుకతను, తెలుసుకోవాల్సిన మిష్టరీ ఏదో ఉంది అనిపించే కుతూహలాన్ని, మీ అన్వేషణను నేను అడ్డుకున్నట్లవుతుంది. “అంతా బ్రహ్మమే! అంతా భగవన్మయమే! ఇది పరిపూర్ణత్వం, నేను పరిపూర్ణుణ్ణి” అని చెప్పాననుకోండి... “అయితే ఏమిటి?” అంతటితో విషయం ముగుస్తుంది. “మీరు పరిపూర్ణులు, నేను పరిపూర్ణుణ్ణి, నువ్వు బ్రహ్మం, నేను బ్రహ్మం” అంటే అంతటితో సర్వం సమాప్తం! తరువాత, అయితే ఏమిటి? (గురువుగారు నవ్వుతూ...) కాబట్టి రెడీమేడ్ సమాధానాల కోసం చూడవద్దు. తెలుసుకోవడానికి ప్రయత్నించండి. ఇది అదేనా? అదేమిటి?

# ప్రయత్నం చెయ్యండి

భక్తుడు:

గురువుగారూ, లెండీ తోటలోని నందదీపం చుట్టూ ప్రదక్షిణ చేయడం నాకు చాలా ఇష్టం. నేను ఆ స్థలం యొక్క ప్రాముఖ్యతను తెలుసుకోవాలనుకుంటున్నాను. దాని గురించి కాస్త చెబుతారా?

గురువుగారు:

మీరు బాబా జీవిత చరిత్ర చదివారు కదా? మీరు సాయి సచ్చరిత్ర చదివితే మీకు తెలుస్తుంది.

భక్తుడు:

నేను చదివాను, కానీ నందదీపం గురించి నేనేమీ తెలుసుకోలేకపోయాను.

గురువుగారు:

అంటే మీరు చరిత్ర పూర్తిగా చదవలేదు. మొదట మీ వైపు నుంచి కొంత ప్రయత్నం చెయ్యండి. మీరు నిజంగా దాని గురించి తెలుసుకోలేకపోతే, అడగండి. మీకై మీరు తెలుసుకునే ప్రయత్నం చెయ్యాలనే నేను ఇంకా కోరుకుంటున్నాను.

మీ వద్ద నుండి పుస్తకాలలో సమాధానాలు దొరకని ప్రశ్నలను నేను ఇష్టపడతాను, అటువంటి ప్రశ్నల్లో ఒక రకమైన ప్రయత్నం కనిపిస్తుంది. సత్సంగం మిమ్మల్ని మరింత సోమరుల్లా చెయ్యడానికి కాదు. “పుస్తకమంతా చదవడమెందుకు? మనం సత్సంగంలో గురువుగారిని అడగవచ్చు కదా, గురువుగారు సమాధానం ఇస్తారు” అనుకుంటున్నారు. అంతేనా? ముందు మీరు ప్రయత్నం చెయ్యండి.

నేను మహాత్ముల గురించి మాట్లాడటానికి ఇష్టపడతాను, దాంట్లో ఎటువంటి సందేహం లేదు. కానీ నేను ఈ రకమైన ప్రశ్నలకు సమాధానమిస్తూపోతే, మీరు మీ వైపు ఎటువంటి ప్రయత్నమూ చెయ్యరు. దీన్ని నేను ఎందుకు ఎత్తి చూపుతున్నానంటే, మన సోమరితనంలో నుండి ప్రశ్న బయటకు రాకూడదు. మనం ప్రయత్నం చెయ్యాలి. ప్రయత్నించండి. మీరు ఏదైనా అర్థం చేసుకోలేనపుడు సహాయం కోసం ప్రయత్నించండి.

## నిజమైన ప్రశ్నలు

గురువుగారు:

మీ ప్రశ్న ఏమిటో ఇంకొక్కసారి తిరిగి అడగమని నేను మిమ్మల్ని అడిగినప్పుడు, మీరు “పర్లేదు గురువుగారూ, అదంత ముఖ్యం కాదు” అన్నారంటే, ఆ మాట మీ ప్రశ్న నిజమైన ప్రశ్న కాదని రుజువు చేస్తుంది. నిజమైన ప్రశ్న మీకు చాలా ముఖ్యమైనదిగా ఉండాలి. మీకది తెలియాలి. ఆ ప్రశ్న మీలో నింపి తీరాల్సిన ఒక కొరతను సృష్టించాలి.

భక్తుడు:

నా ప్రశ్నను ముఖ్యమైనదిగా చేసుకోవడానికి నేను దాని మీద పనిచేయాలని నా స్నేహితుడొకరు చెప్పారు.

గురువుగారు:

ఆ అవసరం లేదు, ఎందుకంటే మనం మాట్లాడే ఈ విషయాలన్నీ నిజంగా అంత ముఖ్యమైనవి కావు. మనం ఇక్కడ అందరం కలసి కూర్చుంటున్నాము, ఈ ప్రశ్నలు మనందరినీ కలిపి

కూర్చోబెడుతున్నాయి. ఆ రకంగా చూస్తే నన్ను ఈ కూర్చీలో ఉంచడం అనే ప్రయోజనం నెరవేరినట్లే. (గురువుగారు నవ్వుతూ...)

సత్సంగంలో ఎవరైనా ప్రశ్నలు వేస్తూ ఉంటే, ఏ ప్రశ్నలూ అడగని మరికొందరు తమలో ఏదో లోపం ఉందని అనుకుని, ప్రశ్నలు వేసేవారిని అనుకరించడానికి ప్రయత్నిస్తూ, కొన్ని అసంగతమైన ప్రశ్నలు వేస్తారు. అది అవసరం లేదు. వారికి ప్రశ్నలు ఏవీ లేకపోతే, ఏమీ అడగవలసిన అవసరం లేదు.

అలా చేయడం జబ్బుతో మందులు తీసుకుంటున్న వారిని మనం అనుకరించినట్లు ఉంటుంది. కొంతమందికి మేధోపరంగా కొంత ఇబ్బంది ఉంటుంది. ఆ ఇబ్బందికి ప్రశ్నలు, సమాధానాలు అనే మందు తీసుకుంటున్నారు. మీకు ఆ జబ్బు లేకపోతే, మందు తీసుకోవాల్సిన అవసరం లేదు. "ఆ వ్యక్తి రోజూ నాలుగుసార్లు మంచి మందులు తీసుకుంటున్నాడు, నేను కూడా నాలుగు సార్లు మందులు తీసుకోవాలనుకుంటున్నాను!" అనుకోవడంలా ఉంటుంది.

## సత్సంగ సారాంశమే విలువైనది

గురువుగారు:

ఏ సత్సంగంలో అయినా ఎప్పుడూ ఒక విషయం గుర్తుంచుకోండి: ప్రతిదీ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించకండి! మీరు ఒక రెస్టారెంట్‌కు వెళితే, మీకు మెనూ ఇస్తారు, అందులో చాలా వంటకాలు ఉంటాయి – మీరు రెండు లేదా మూడు పదార్థాలను మాత్రమే ఎంచుకొని తింటారు. మీరు రెస్టారెంట్‌కు వెళ్ళారు కాబట్టి, మెనూలోని ప్రతిదీ తినవలసిన అవసరం లేదు. అంతేకదా?

సత్సంగం రెస్టారెంట్ లాంటిది, నేను మీకు మెనూని అందించాను, మీకు నచ్చిన వాటిని మీరు ఎంచుకోండి.

భక్తుడు:

నేను ఓ సత్సంగంలో మీరు చెప్పిన మాటలను ఉదహరించాలనుకుంటున్నాను. కానీ మీరు ఆ సత్సంగంలో ఉపయోగించిన అవే పదాలు నాకు గుర్తురావడం లేదు.

గురువుగారు:

అంతకుముందు జరిగిన సత్సంగాలకు వెళ్ళి నేను చెప్పిన వాటిని ఉదహరించకండి. సత్సంగం విషయంలో కూడా మనం పాతదనం లేకుండా అప్పటికప్పుడు క్రొత్తగా ఉండాలి. మీరు నేను తిరిగి మళ్ళీ వెనుకకు వెళ్ళాలనుకుంటారు, అది నేను చేయలేను. సత్సంగంలో విలువైనది ఏమిటంటే అందులోని సారాంశం.

మీరు ఆకలితో ఉన్నారు. క్రితంసారి నేను మీకు చపాతీ ఇచ్చాను. ఇప్పుడు నేను మీకు పూరి లేదా ఇడ్లీ ఇస్తాను. "లేదు, లేదు, లేదు. క్రితంసారి నేను ఆకలితో ఉంటే మీరు చపాతీ ఇచ్చారు, ఇప్పుడేమో మీరు నాకు ఇడ్లీ ఇస్తున్నారు!" అంటున్నారు. నేను చెప్పేది ఏమిటంటే మీ ఆకలి తీరిందా లేదా అని చూడండి, అంతే. పోయినసారి ఇచ్చిన చపాతీల గురించి మాట్లాడవద్దు.

భక్తుడు:

గురువుగారూ, మీరు లక్ష్యాన్ని కలిగి ఉండటం యొక్క ప్రాముఖ్యత గురించి మాట్లాడారు. లక్ష్యాన్ని నిర్దేశించుకోవడానికి ఉత్తమ మార్గం ఏమిటి?

గురువుగారు:

లక్ష్యాన్ని నిర్దేశించుకోవడానికి ప్రయత్నించే బదులు, మీ లక్ష్యమేమిటో తెలుసుకోండి. లక్ష్యం అనేది ఆకలిలాంటిది. మన విచక్షణారహితమైన ఆహారపు అలవాట్ల వల్ల మన ఆకలి చచ్చిపోయింది. ఆకలి లేకపోవడం వలన మీ ఆకలి మీకు తెలియడం లేదు. ఈ సత్సంగాలు మొదలైన వాటి ద్వారా నేను మీకు ఆకలిని కలిగించే కొన్ని పదార్థాలను ఇవ్వడానికి ప్రయత్నిస్తున్నాను. ఇవి పనిచేస్తే మీ ఆకలి మీకు తెలుస్తుంది, అంతేగానీ మీరు ఆకలిని తెచ్చిపెట్టుకోవడం లేదు. మీకు ఏం కావాలో అప్పుడు తెలుస్తుంది. ఒక లక్ష్యాన్ని తెచ్చిపెట్టుకోవడం తప్పు.

భక్తుడు:

అంటే అది సిద్ధాంతపరమైనదిగా ఉండకూడదని మీ ఉద్దేశ్యమా?

గురువుగారు:

అవును. చాలామంది చేసేది అదే. వాళ్ళకు అవసరం లేని లక్ష్యాన్ని తెచ్చిపెట్టుకుంటారు. మోక్షం, ఆత్మసాక్షాత్కారం, 'నేనెవరు' ఇలాంటివి. ఇవన్నీ తెచ్చిపెట్టుకునే లక్ష్యాలు. "నేను ఎవరో

తెలుసుకోవాలనుకుంటున్నాను” అంటారు – కానీ వారు ఎవరో తెలుసుకోవలసిన అవసరం నిజంగా వారికి లేదు. అది వాళ్ళ నిజమైన ఆకలి కాదు.

భక్తుడు:

సిద్ధాంతపరమైనదీగాక, ఎక్కడో చదివినదో, విన్నదో కాకపోతే మరి ముందుకు పోవడం ఎట్లా, గురువుగారూ?

గురువుగారు:

ఎవరికి వారు దానిని తెలుసుకోవాలి, ఆకలిలాగా దానిని అనుభవించాలి. మీరు ఆకలితో ఉన్నప్పుడు మీరు ఆకలిని ‘తెచ్చిపెట్టుకోరు’, మీరు ఆకలిని అనుభవిస్తారు, మీ అవసరం మీకు తెలుస్తుంది: మీకది అవసరంగా అనిపించాలి. ఒకవేళ మీకది అంత తీవ్రంగా అనిపించకపోతే ఆకలిని కలిగించే వాటిని ఇవ్వడం ద్వారా దానిని పెంచడం జరుగుతుంది. లేదూ, అలా కాకపోతే భేదులు, విరేచనాలు అయ్యేలా కొన్ని మందులు వాడవలసి ఉంటుంది. (గురువుగారు నవ్వుతూ...) నా చుట్టూ ఇక్కడ, ఈ మార్గాలన్నింటి ద్వారా మీ స్వంత ఆకలిని, మీ స్వంత లక్ష్యాన్ని మీరు స్పష్టంగా తెలుసుకునేలా చేయడం జరుగుతుంది. మీ అందరికీ లక్ష్యాలు ఉన్నాయి – అవి మీకు అవసరం లేదని కాదు, ప్రతి ఒక్కరికీ వారి వారి స్వంత లక్ష్యాలు ఉన్నాయి. కానీ అంత ఆకలి లేదు. ఆకలి చచ్చిపోయింది. మీరు ఆకలిని అనుభవించడం లేదు, మీరు తినింది అరగడం లేదు! ఆ విషయాన్ని నేను మీకు చూపించాల్సిన అవసరం ఉంది.

# ప్రేమ, ఆనందం

భక్తుడు:

ప్రేమ గురించి, ఆనందం గురించి మీరు చాలా ప్రముఖంగా చెప్తారు. వాస్తవానికి ఈ రెండింటి మధ్య సంబంధం ఏమిటి? ఆనందం ప్రేమకు బిడ్డలాంటిదా లేదా ఆనందం ప్రేమకు ఆహారమా? ఆనందం ఏవిధంగా జనిస్తుంది?

గురువుగారు:

ఆనందం ప్రేమకు బిడ్డ. మనం దేనినైనా ప్రేమించి, అది మనకు లభించినపుడు ఆ ప్రేమ మూలంగా మనకు సంతోషం, ఆనందం వస్తుంది. ఆ ప్రేమ లేకపోతే ఆనందం రాదు. మనం దేనినైనా ప్రేమిస్తే చాలా కష్టమైన పరిస్థితిలో కూడా మనకు ఆనందం కలుగుతుంది.

(ఉత్తరకాశీ నుండి గంగోత్రికి వెళ్ళి తిరిగివచ్చిన విషయాన్ని గురువుగారు ప్రస్తావిస్తూ ) రోజంతా ప్రయాణంచేసి, అంత ఎత్తుకు వెళ్ళి తిరిగివచ్చి, స్నానం చేసి, కడుపునిండా భోంచేసిన తర్వాత ఇంత రాత్రిపూట సత్సంగంలో కూర్చోవడంలో ఏమి ఆనందం ఉంది – ఇది హింస కాదా?

భక్తులు: [ఒకేసారి] లేదు, గురువుగారూ.

గురువుగారు:

ఎందుకు? ఎందుకంటే సత్సంగమంటే మీకు ఇష్టం. అందుకే మీకు అందులో ఆనందం ఉంది. కాబట్టి మీకు ఆనందం కలిగించేది మీ ప్రేమ. కాబట్టి దీనర్థమేమిటంటే ఆనందానికి ప్రేమ తల్లి వంటిది.

## వాతావరణాన్ని అనుకూలంగా మలచుకోవడం

భక్తుడు:

ప్రేమను సంరక్షించుకుని పెంపొందించుకోవడం ఎలా? ప్రేమ ఎలా పెరుగుతుంది?

గురువుగారు:

ప్రేమ పెరగడానికి ఒక పద్ధతి లేదా ఒక టెక్నిక్ అంటూ ఏమీ లేదు. అక్కడ ఉండేటటువంటి ఏకైక విషయం ఏమిటంటే, మీకు ప్రేమ ఉందని, ఆ ప్రేమను పెంచుకోవాల్సిన అవసరం ఉందని, ఆ ప్రేమను అనుభవంలోనికి తెచ్చుకోవాలనీ కోరుకుంటే ఆ ప్రేమ విస్తృతంగా పెరగడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించుకోవడానికి ప్రయత్నించండి, లేదా అటువంటి వాతావరణంలో ఉండటానికి ప్రయత్నించండి, అప్పుడు ప్రేమ తనంతట తానుగా పెరుగుతుంది. అనుకూలమైన వాతావరణం ఏర్పరచినపుడు, మొక్క పెరుగుతుంది, అంతే. మొక్క పెరగడానికి మీరు చేయగలిగింది ఏమిటి? ఏమీ లేదు. దానికి మీరు నీరు, ఎరువు, సరైన వాతావరణం వంటి ఆసరా మాత్రమే ఇవ్వగలరు. మీరు ఇవ్వవలసినది అదే. అది చాలు. మీరు ఒక మొక్కను తీసుకుని సాగదీస్తే అది పెరుగుతుందా?

భక్తుడు:

సరైన వాతావరణం ఏమిటి, గురువుగారూ?

గురువుగారు:

మీ ప్రేమకు ఎటువంటి అడ్డంకులు లేని వాతావరణం. ఎక్కడైతే మీరు ప్రేమను మరింతగా పొందడానికి, ప్రేమను మరింత అనుభవంలోకి తెచ్చుకోవడానికి అవకాశముందో అటువంటి

వాతావరణం. ఎక్కడైతే సాటివారు మనం కోరుకునే ప్రేమను భిన్నరూపాలలో కలిగివుండి, దానిని రకరకాల మార్గాలలో అనుభూతి చెందుతూ, పంచుకుంటూ ఉంటారో అటువంటి వాతావరణం. అప్పుడు మీరు సరైన వాతావరణంలో ఉంటారు. మీరు అటువంటి వాతావరణంలో ఉండాలి, లేదా అటువంటి వాతావరణాన్ని మీరు సృష్టించుకోవాలి – రెండూ నేను చెప్పాను.

ఆ వాతావరణం లేకపోతే, మీరు మీ స్వంతంగా సృష్టించుకోవాలి. అటువంటి వాతావరణంపైన ఆధారపడి జీవించడం సరైనది కాదు. మన స్వంత వాతావరణాన్ని మనం సృష్టించుకునే సామర్థ్యం కూడా ఉండాలి.

ఉదాహరణకు, ఆంధ్రప్రదేశ్‌లో వరి తేలికగా పెరుగుతుంది. ఇక్కడ హిమాలయాలలో ఈ లోయ వాలుల్లో వాళ్ళు ఎలా చేశారో చూడండి (వ్యవసాయ యోగ్యం కాని ఎగుడుదిగుడు కొండ భూముల్లో వరి సాగుచేస్తున్న వారి పద్ధతులను గురువుగారు ఉదహరిస్తున్నారు). అక్కడ వాళ్ళు వరిసాగుకు అనువైన పరిస్థితులు కల్పించారు. కొండరాళ్ళతో గట్టులా కట్టి, కాలువలు తీశారు, ఆ ప్రక్కనే నీటిని నిల్వ చేసుకునే ఏర్పాట్లు చేశారు. చూడండి, వాళ్ళు వరి పండటానికి కావలసిన వాతావరణాన్ని కల్పించారు. అది వరిని సాగుచెయ్యడానికి అనువైన ప్రదేశం కాదు. కానీ వాళ్ళు దానిని అనువుగా చేసి, వరిని సాగుచేస్తున్నారు. మనం చెయ్యవలసినది కూడా అదే.

భక్తుడు:

అలా చెయ్యడం ఎలా, గురువుగారూ?

గురువుగారు:

అటువంటి పరిస్థితులను కల్పించుకోవడం, సత్సంగంలో ఉండటం, మనం ఎలా ఉండాలి అని

అనుకుంటున్నామో అలా ఆలోచించే మనుషుల మధ్య ఉండటం, వారితో మన అనుభవాలు పంచుకోవడం... ఇలాంటి వాటి ద్వారా అలా చేసుకోవచ్చు, అలా మీ ప్రేమను పంచుకోండి!

గొప్ప మహాత్ముల జీవిత చరిత్రలను చదవండి. ప్రతిరోజూ నియమంగా కొన్ని గంటలపాటు ధ్యానం చేసుకోగలిగితే మంచిది. బాబా ఫోటో ముందు కూర్చొని ఆయన సన్నిధిని అనుభూతి చెందండి. మీరు కళ్ళు మూసుకోవచ్చు లేదా కళ్ళు తెరుచుకోవాలనిపిస్తే బాబా ఫోటోను చూస్తూ ఉండవచ్చు.

ఒకరోజు, ఒక పాశ్చాత్య భక్తునికి భగవాన్ ఫోటో అతన్ని చూసి నవ్వుతున్నట్లు అనిపించింది, అతనికి అది చాలా వాస్తవికంగా అనిపించింది. అతను ఈ విషయం గురించి భగవాన్ వద్ద ప్రస్తావించి, అది నిజమా, ఊహా లేక మనోకల్పనా అని అడిగాడు. దానికి భగవాన్, “ఇది కేవలం ఛాయాచిత్రం అని మీరు ఎందుకు అనుకుంటున్నారు?” అన్నారు. అంటే అది కేవలం ఛాయాచిత్రం కాదని భగవాన్ పరోక్షంగా ధృవీకరించారు.

మీరు ఇంటి దగ్గర ఉన్నప్పుడు ఏవైనా పాటలు మీకు తోచినట్లు పాడుకోవాలనిపిస్తే – అవి భజనలు కావచ్చు లేదా నామం కావచ్చు – మీ భాషలో మీరు పాడుకోవచ్చు. అవి మనం ఇక్కడ పాడుకునే నిర్ణీతమైన భజనలు కానక్కర్లేదు. మీరు పనిచేస్తున్నప్పుడు, అంటే వంట చేస్తున్నప్పుడుగాని, తోటపని చేస్తున్నప్పుడుగానీ ఇవి చేసుకోవచ్చు.

ఒక నిర్ణీత సమయాన్ని పెట్టుకుని మనలాగే ఆలోచించే వారిని కలుసుకునే ప్రయత్నం చేయండి, అదే సత్సంగం, ఉదయం లేదా సాయంత్రం మీకు సమయం దొరికినపుడు కలసి కూర్చోవడానికి ప్రయత్నించండి. ప్రతి నిత్యం క్రమం తప్పకుండా అందరూ కలసి ధ్యానం చేసుకోవడం లాంటి ఆలంబన (సపోర్ట్)ను ఏర్పాటు చేసుకోండి.

సత్సంగానికి సంబంధించిన మరో విషయం ఏమిటంటే – మనం అంతమంది ప్రేమ మధ్యలో ఉన్నప్పుడు, మనకు తెలియకుండానే పొడిబారిన మన మనసులు చుట్టూ ఉన్నవారి ప్రేమతో తడిచి ఆర్ద్రమవుతాయి. ఎందుకంటే, కొన్నిసార్లు మనలో భావోద్వేగం ఉండదు, దాన్ని కోల్పోవడం వల్ల మనస్సు పొడిబారిపోతుంది. అప్పుడు చుట్టుప్రక్కల వాళ్ళ ప్రేమ మనపై ప్రభావాన్ని చూపిస్తుంది. ఆ ప్రభావానికి లోనుకావడానికి మీకు మీరే అవకాశం కల్పించుకోవడానికి ప్రయత్నించండి, దానిలోని ప్రయోజనాలను పొందండి! అందరూ కలసి సామూహికంగా ప్రేమను వ్యక్తం చేయడంలో ఆ ప్రయోజనం ఉంది, అందుకే నేను దానిని ప్రోత్సహిస్తాను.

“ఈ సత్సంగాలు, అనుభవాలు పంచుకోవడం... ఇవన్నీ ఏమిటి? నేను ఆ సత్యాన్ని తెలుసుకోవడానికి, నేను ఆ అనుభవాన్ని పొందడానికి, వీటికీ ఏమీ సంబంధం లేదు!” అని మీరనుకోవచ్చు. పంటకు, దాని చుట్టూ ఉండే కంచెకు ఎలాంటి సంబంధం ఉంటుందో ఇదీ అలాంటిదే. మీరు భూమిలో విత్తనాలు నాటుతారు, అవి మొలకెత్తుతాయి, తరువాత పంట వస్తుంది. ఆ ఫలసాయాన్ని పొందాలనుకుంటే మీకు మంచి కంచె అవసరం. కంచె పంటలో భాగం కాదు, కానీ మీరు నిజంగా ఫలసాయాన్ని పొందాలనుకుంటే మాత్రం మీరు కంచె గురించి జాగ్రత్త తీసుకోవాలి, లేకపోతే మీకసలు ఆ పంట చేతికందదు.

భక్తుడు:

మీరు సత్సంగం కంచె లాంటిది అని కదా అంటున్నారు?

గురువుగారు:

అవును. మనలో చాలామంది మనస్సులు చాలా బలహీనంగా ఉండి, చుట్టుప్రక్కల పరిస్థితుల వలన సులభంగా ప్రభావితమవుతుంటాయి. కాబట్టి మనకు ఏదో ఒక రకమైన రక్షణ అవసరం.

మనలో ప్రేమ, అనుగ్రహం అనే చిన్న మొక్క ఇప్పుడే నాటబడింది. అది పెద్ద చెట్టుగా మారేదాకా దాని చుట్టూ కంచె కట్టి కాపాడుకోవాలి. ప్రేమ బీజాలు గాలికి రెపరెపలాడే చిన్న దీపంలా ఉన్నప్పుడు, దానికి గాలి అనేది చాలా ప్రమాదకారిగా ఉంటుంది. దానికి చిమ్నీగాని, గ్లాసుగానీ రక్షణగా అవసరం. అదే పెద్దమంట అనుకోండి, అది పరిసరాలలో ఉన్న వాటినన్నింటినీ దహించివేస్తుంది. మీ అన్వేషణ, మీలోని ప్రేమోద్వేగం చాలా శక్తివంతంగా మారినపుడు మీరు మీ పరిసరాలను ప్రభావితం చెయ్యగలరు, అప్పుడు మీరు ఎక్కడికి వెళ్ళినా అక్కడ సత్సంగం దానంతట అదే ఏర్పడుతుంది. కానీ పరిసరాల వలన ప్రభావితమవుతున్నాము అని మీరు భావిస్తున్నంతవరకు మీకు చిమ్నీ (సత్సంగం) అవసరం.

## నిరంతరమైన సత్సంగం

భక్తుడు:

గురువుగారూ, మీరు నిరంతరం సత్సంగంలో ఉండటమనే స్థితి గురించి ఇంతకు ముందు మాట్లాడారు. ఆ స్థితి గురించి కొంచెం వివరిస్తారా?

గురువుగారు:

మీరు ఆకలితో ఉన్నారు, ఆహారం తింటున్నారు, మీరు ఏ స్థాయిలో సంతృప్తి చెందుతారు? మొదటి ముద్దతో మీ ఆకలి తీరదు. అలాంటప్పుడు మీరు ఆ మొదటిముద్దను ఎందుకు తినాలి? ఎందుకంటే మొదటి ముద్ద రెండవ ముద్దకు, రెండవది మూడవ దానికి, మూడవది నాలుగవ దానికి... ఇలా దారితీస్తుంది కాబట్టి. అలా కడుపు నిండిపోయాక “ఇక చాలు” అనిపిస్తుంది,

అప్పుడు మీరు ఆహారం తీసుకోవడాన్ని మాని, విశ్రాంతి తీసుకుంటారు. అప్పుడు మీరు ఆకలిని గురించిగాని, ఆహారం గురించిగానీ అస్సలు ఆలోచించరు. కానీ మీకు సంతృప్తిగా ఉంటుంది, మీరు విశ్రమించి ఓ కునుకుతీస్తారు. నిజానికి మీ లక్ష్యమది. మీరు దానిని చేరుకోవడానికి మీకు ఆకలి వేసింది, ఆహారం దొరికింది, మీరు తిన్నారు. మీరు చివరిలో కునుకు తీస్తున్నపుడు ఆకలి, ఆహారంలాంటి విషయాలు మీ మనస్సుకు రావు, మీరు కునుకు తీయడమనే దానికి ఆకలితోనూ, ఆహారంతోనూ సంబంధం లేదు. అయినప్పటికీ ఈ కునుకు తీయడం అనేది నిరంతరం తింటూ ఉండటంలాంటిది. (గురువుగారు నవ్వుతూ...) ఇప్పుడు ఏం చేస్తున్నారంటే ఒక ముద్ద, రెండు ముద్దలు ఇలా తింటున్నారు, అది కొనసాగుతూ ఉంటుంది. ఎప్పటివరకు? మీకు ఆకలి పూర్తిగా తీరేవరకు. అప్పుడు మీకు సత్సంగం అవసరం లేదు, నేను అవసరం లేదు. ఆ స్థితిలో మీకు ప్లేటు, డైనింగ్ టేబులు, హోటలూ... ఇవేమీ అవసరం లేదు. (గురువుగారు నవ్వుతూ...)

భక్తుడు:

కానీ అది తాత్కాలిక అనుభవం కాదా?

గురువుగారు:

అవును, శారీరకమైన ఆకలి విషయంలో తాత్కాలికమే, మళ్ళీ ఆకలి వేస్తుంది, కానీ ఇది అంతరంగంలోని విషయం, ఒక్కసారి తీరిపోయిన తర్వాత అది మళ్ళీ జరగదు. అప్పుడు మీరు నిరంతరమైన సత్సంగమనే స్థితిలో ఉంటారు.

*5 జూలై 2020, గురుపూర్ణిమ సందర్భంగా 'సాయిపథం' సమర్పణ*